సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



విద్యార్థుల ప్రతిభకు 'ఉపకారం'

పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. 10లో▸



ఒక్క అవకాశం ఇవ్వండి

నాలుగు సార్లు ఓడిపోయిన. ఒక్కసారి అవకాశమివ్వాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రజలను కోరారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి అధికమవుతుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వ్యవసాయ కళాశాలలో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకేంద్రంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం నాలుగు కిలోమీటర్ల ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ భారతినారాయణభట్ ప్రారంభించారు. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ ఫ్రీడం రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎల్లాగౌడ్, రత్నాకర్, ప్రొఫెసర్ సంపత్, సాయికుమార్ పాల్గొన్నారు.

'మీటర్‌కు తర్వాత దరఖాస్తు చేసుకోండి'



కలెక్టరేట్‌లో నోటీసు అంటించిన పంచాయతీరాజ్ శాఖ వారు

జగిత్యాల: ఇటీవల డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించిన విషయం తెల్సిందే. దీంతో కొందరు గృహప్రవేశం చేస్తున్నారు. అయితే ఇళ్లలో ఇంకా కరెంట్, వాటర్ పైప్‌లైన్ పూర్తి కాలేదు. కొన్నింటిలో ప్యానల్ బోర్డులు పూర్తి కాలేదు. గృహప్రవేశం చేసిన కొందరు మీటర్ల కోసం దరఖాస్తు చేసుకుంటే 'ఇళ్లలో ఇంకా పనులు పూర్తి కాలేదు. పూర్తయిన అనంతరమే మీటర్లకు దరఖాస్తులు చేసుకోవాలి..' అంటూ పంచాయతీరాజ్ శాఖ కలెక్టరేట్‌లో నోటీసులు అంటించింది. కొందరు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లకు తాళాలు వేసుకుని రావడంతో పనులకు ఆటంకం ఏర్పడుతోందని తెలుస్తోంది.

మున్సిపాలిటీల్లో నిలిచిన సేవలు

- సాంకేతిక లోపమే కారణం



జగిత్యాల మున్సిపాలిటీ

జగిత్యాల: జిల్లాలోని మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతికలోపంతోనే పత్రాలు జారీ కావడం లేదని అధికారులు అంటున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ మాత్రమే ఆగిపోయింది. దీంతో దరఖాస్తుదారులు 12 రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయానికి రావడం.. పత్రాలు జారీకాకపోవడంతో వెనుదిరగడం ప్రజలకు పరిపాటిగా మారింది. సాంకేతిక లోపాలు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెక్‌పోస్టును పరిశీలించిన కరీంనగర్ అదనపు కలెక్టర్



చెక్‌పోస్టు వద్ద అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

మల్యాల: మండలంలోని రాజారం శివారు.. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ఓటర్లను ప్రభావితం చేసే విలువైన సామగ్రి, మద్యం, డబ్బులు అక్రమంగా తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.మునీందర్, ఆర్ఐ తిరుపతి, ఎస్ఎస్‌టీ టీం సభ్యులు పాల్గొన్నారు.

హడావుడి షురూ..!

- ఎన్నికలకు యంత్రాంగం సమాయత్తం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 6,87,952
- పెరిగిన కొత్త ఓటర్లు
- ఫిర్యాదుల కోసం 1950 టోల్‌ఫ్రీ నంబర్



ఆర్డీవో కార్యాలయంలో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో నర్సింహమూర్తి

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో హడావుడి మొదలైంది. ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ ఏర్పాట్లపై ఆరా తీస్తున్నారు. ఓటరు నమోదు, ఓటు వినియోగంపై ఇప్పటికే ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ ఆఫ్ కండక్ట్ సహా ఇతర అంశాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈవీఎంలు, శాంతిభద్రతలు, రవాణా, నిర్వహణ, బ్యాలెట్ కమ్యూనికేషన్, సైబర్ సెక్యూరిటీ, ఓటరు బ్యాలెట్, ఓటరు జాబితాను పరిశీలిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 16 మంది నోడల్, 78 మంది సెక్టోరి యల్, ముగ్గురు రిటర్నింగ్ అధికారులను నియమించారు. జిల్లాలో 785 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. జగిత్యాలలో 254, కోరుట్లలో 262, ధర్మపురిలో 269 చొప్పున కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సమస్యాత్మక కేంద్రాలుగా కోరుట్లలో 86, జగిత్యాలలో 44, ధర్మపురిలో 67, చొప్పదండిలో 19, వేములవాడ నియోజకవర్గ పరిధిలో 32గా గుర్తించారు.

పెరిగిన కొత్త ఓటర్లు

కలెక్టర్ యాస్మిన్ భాషా ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లాలో కొత్త ఓటర్లు పెరిగారు. 18 నుంచి 19ఏళ్ల వారు 21,025 మంది ఉండగా 11,888 పురుషులు, 9,135 మంది మహిళలు, 20 నుంచి 29 ఏళ్ల వారు 1,40,622మందిలో 70,983 పురుషులు, 69,622 మంది మహిళలు, ఓటర్లు 6,87,952 మంది కాగా.. వీరిలో 3,32,293 మంది పురుషులు, 3,55,629 మంది మహిళలు ఉన్నారు.

ఫిర్యాదులకు 1950 టోల్‌ఫ్రీ

ఎన్నికలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా 1950 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేశారు. అనధికారికంగా డబ్బు, ఇతర వస్తువులను రవాణా చేసినట్లయితే వాటిని పట్టుకుని నిబంధనల మేరకు చర్యలు తీసుకునేలా చూస్తారు. సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై ఎన్నికల సిబ్బంది పాల్గొనకూడదని అధికారుల నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి.

ఈనెల 31వరకూ ఓటరుగా అవకాశం

18 ఏళ్లు దాటిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీరికి ఈనెల 31వరకు అవకాశం కల్పించారు. పేర్లు సరిగా ఉన్నాయా..? లేదా..? చూసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌తోపాటు ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌లో అవకాశం ఉంది. ఈ విషయాలు తెలియని వారు కలెక్టరేట్‌లో ప్రారంభించిన 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సలహాలు పొందవచ్చు. వీరు సందేహాలను నివృత్తితోపాటు ఫాం–6, 6ఏ, ఫాం–7, 8 ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరిస్తారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు ఫాం 6ను ఉపయోగిస్తారు. ఇప్పటివరకు 400 మంది టోల్‌ఫ్రీ నంబరు 1950కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకున్నారని అధికారులు తెలిపారు.

సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: సీ విజిల్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంటెలిజెన్సీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సీ విజిల్ యాప్‌పై ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా మద్యం, డబ్బు, సరుకుల పంపిణీ జరిగితే సాధారణ ప్రజలు కూడా సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారు సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. రూ.10 లక్షల డబ్బుకు సంబంధించి ఇన్‌కంటాక్స్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఫొటో లేదా వీడియో ఇతరత్రా ఫిర్యాదులను యాప్ ద్వారా పంపించవచ్చని, సమాచారం మేరకు సమీపంలోని ఫ్లయింగ్ స్క్వాడ్స్ వచ్చి వాటిని పంచనామా, వీడియోగ్రఫి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తారని వివరించారు. రుజువులుంటే జిల్లా కమిటీకి అప్పీలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్‌రూమ్ నంబరు 18004257620 లేదా 1950కు తెలియజేయవచ్చన్నారు. అధిక మొత్తంలో బ్యాంక్ ఖాతా నుంచి లావాదేవీలు జరిగినా బ్యాంక్ అధికారులు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల టీంలు ఎప్పటికప్పుడు నిరంతరంగా పర్యవేక్షిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, దివాకర, ఆర్డీవోలు రాజేశ్వర్, నర్సింహమూర్తి, డీఎస్పీ వెంకటస్వామి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- డెప్యూటీ ఎన్నికల అధికారి బీఎస్.లత



మాట్లాడుతున్న లత

జగిత్యాల: పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి వసతులు కల్పించాలని డెప్యూటీ ఎన్నికల అధికారి బీఎస్.లత అన్నారు. గురువారం ఆర్డీవోలు, ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్‌కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంప్‌లు, రేలింగ్స్, ఫర్నీచర్ వంటి సౌకర్యాలపై తహసీల్దార్లతో సమీక్షించాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. దివ్యాంగులకు ర్యాంపుల తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు తిరిగేలా చూడాలని తెలిపారు. అవసరమైన మరమ్మతు చేయించాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. మరుగుదొడ్లు లేని పోలింగ్ కేంద్రాల్లో ఉపాధిహామీ పథకం కింద నిర్మాణాలు చేపట్టాలని పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో నీడ, నీటి వసతి కల్పించాలని సూచించారు. సమస్యలుంటే పరిశీలించి పరిష్కరించాలన్నారు.

'దళితబంధు'పై కొనసాగుతున్న నిరసనలు

- రెండోరోజు జగదేవుపేటలో దళితుల ఆందోళన
- ఎంపీపీ, సర్పంచ్‌ల నిలదీత ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసిన ప్రజాప్రతినిధులు



జగదేవుపేటలో ఆందోళన చేస్తున్న దళితులు

వెల్గటూర్: దళితబంధు పథకాన్ని అనర్హులకే కేటాయించారని పేర్కొంటూ మండలంలోని జగదేవుపేటలో రెండోరోజు నిరసనలు వ్యక్తమయ్యాయి. దళితబంధు, గృహలక్ష్మి జాబితాలో అర్హులు కాకుండా బీఆర్ఎస్ నాయకులు, వారి బంధువులకు మాత్రమే కేటాయించారని పేర్కొంటూ దళితులు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, సర్పంచ్ భర్త రాజేశ్వర్‌రెడ్డిని చుట్టుముట్టి నిలదీశారు. ఇళ్లు, భూములు లేని నిరుపేదలకు కాకుండా భూములు, ట్రాక్టర్లు, జేసీబీలు ఉన్నవారికి కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మరోవిడత జాబితాలో అర్హుల పేర్లు ఉండేలా చూస్తానని ఎంపీపీ సముదాయించినా వారు వినలేదు. పదవి ఉన్నవారే దళితబంధును ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. జాబితాలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సామాజికవర్గానికి అధికంగా కేటాయిస్తున్నారని విమర్శించారు. ఎండపల్లి మండల కేంద్రంలోనూ ఆగ్రహజ్వాలలు రగిలాయి. పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. సర్పంచ్ అనుకూల వర్గానికే దళితబంధు కేటాయించారని ఆరోపించారు. సర్పంచ్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల ఆగ్రహాన్ని గ్రహించిన సర్పంచ్, అధికార పార్టీ ముఖ్య నేతలు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడం గమనార్హం.

యూనిట్‌ను పది కుటుంబాలకు ఇవ్వాలి

ధర్మపురి: దళితబంధు కింద అందిస్తున్న ఒక్కో యూనిట్‌ను పది కుటుంబాలకు రూ.లక్ష చొప్పున అందించాలని మండలంలోని నాగారం దళితులు తెలిపారు. గురువారం మండలంలోని నాగారం పంచాయతీ ముందు ఆందోళన చేపట్టారు. సర్పంచ్, ఎంపీటీసీని నిలదీశారు. అనర్హులకు కాకుండా అర్హులకు పది మందికో యూనిట్ ఇచ్చినా చాలన్నారు. గ్రామానికి చెందిన దళితులు రాజనర్సయ్య, సత్తయ్య, పోచయ్య, లక్ష్మణ్, వినోద్, మలవ్వ, అనిత, గంగవ్వ తదితరులున్నారు.

తలనీలాలు అప్పగింతకు పైరవీలు.?



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామికి భక్తులు సమర్పించే తలనీలాలకు గతంలోనే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ టెండర్ రుసుం అప్పగించినా జీఎస్టీ మాత్రం చెల్లించలేదు. దీంతో ఆలయ అధికారులు సదరు తలనీలాలను భద్రపరిచారు. తలనీలాల టెండర్‌కు సంబంధించి ఇంకా సుమారు రూ.40లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో తలనీలాల మరో టెండర్‌దారుడు తమకు జీఎస్టీ వర్తించదని కోర్టును ఆశ్రయించారు. దానిపై కోర్టు ఇప్పటివరకూ తీర్పు ఇవ్వలేదు. మరోవైపు దేవాదాయ శాఖలోని ఓ అధికారి కొండగట్టు ఆలయ అధికారులకు ఫోన్ చేసి తలనీలాలను టెండర్‌దారులకు ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. కమిషనర్ ఉత్తర్వులు లేకుండానే టెండర్‌దారులకు ఇచ్చేందుకు పైరవీలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ కోర్టు జీఎస్టీ చెల్లించాలని తీర్పు ఇస్తే టెండర్‌దారుల నుంచి డబ్బులు ఎలా వసూలు చేస్తారు..? కమిషనర్ ఉత్తర్వులు లేకుండా ఎలా ఇస్తారు..? అలా ఇవ్వాలనుకుంటే మిగతా టెండర్‌దారులకు కూడా జీఎస్టీ నుంచి వెసులుబాటు కల్పించాలని దుకాణాదారులు దేవాదాయ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధైర్యపడొద్దు.. అందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు



ఎమ్మెల్యేను అభినందిస్తున్న లబ్ధిదారులు

జగిత్యాల: అందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వస్తాయని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం 43వ వార్డుకు చెందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేను సన్మానించారు. పేదల కోసం కష్టపడి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారని పేర్కొన్నారు. అందరం తమ వెంటే ఉంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఫిర్దోస్ తరన్నుం, ముకీమ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఖర్చు లెక్కపై పక్కాగా నిఘా

- అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.40లక్షలు
- సెగ్మెంట్‌వారీగా ఆడిటింగ్ టీంలు



కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల లెక్కలపై పక్కాగా నిఘా వేసేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులకు విధించిన వ్యయ పరిమితిని ఈసారి ఎన్నికల సంఘం పెంచింది. ఈ క్రమంలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పక్కాగా చేసేందుకు జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి సెగ్మెంట్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఎప్పటికప్పుడు అభ్యర్థుల వ్యయంపై నిఘా పెట్టి కచ్చితమైన పరిశీలన జరిపి నమోదు చేయనున్నాయి.

నవంబర్ 3 నుంచి అభ్యర్థి ఖాతాలోకి..

గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు పరిమితి రూ.28 లక్షలు ఉండగా.. మునుగోడు ఉప ఎన్నిక నుంచి ఆ వ్యయ పరిమితిని రూ.40 లక్షలకు పెంచారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలకు ఇదే నిబంధన వర్తించనుంది. ఈ ఖర్చులో అభ్యర్థి వాహనాలు, ప్రచారం నిర్వహించే క్రమంలో ఏర్పాటు చేసే స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, ముఖ్య నేతల సభలు, కరపత్రాలు, పోల్‌చీటీలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడలపై రాసిన రాతల వ్యయం ఇతరత్రా అన్ని రకాల ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా చేసే వ్యయం మొత్తం కలిసి రూ.40లక్షల లోపు ఉండాలి. ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుంచి అభ్యర్థికి సంబంధించిన ప్రతి ఖర్చునూ లెక్కలోకి తీసుకుంటారు. అంతకుముందు పార్టీ తరఫున జరిగే ప్రచారానికి సంబంధించిన ఖర్చును అభ్యర్థి ఖర్చుల లెక్కలోకి కాకుండా పార్టీ ఖర్చుల కింద నమోదు చేస్తారు.

ఎక్కడికక్కడే పక్కా నిఘా..

ఈసారి ఎన్నికల ఖర్చులకు సంబంధించిన ఖర్చులను నమోదు చేయడానికి ఎన్నికల అధికారులు పక్కాగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ వచ్చే నవంబర్ 3నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండే ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చుపై పక్కాగా నిఘా వేయనున్నారు. అభ్యర్థి నిర్వహించే ప్రచారానికి చెందిన సభలు, సమావేశాలు, ముఖ్య నేతల బహిరంగ సభలు, ప్రచారంలో చేస్తున్న ఖర్చులు వంటి వాటికి చేస్తున్న ఖర్చులను లెక్కించడానికి ఆయా అభ్యర్థులను అనుసరిస్తూ షాడో టీంలు పనిచేస్తాయి. ఈ షాడో టీంలు అభ్యర్థి ప్రచార అంశాలను వీడియో రికార్డు చేస్తారు. ఇలా రికార్డు చేసిన వీడియోలను ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఉండే వీడియో వ్యూయింగ్ టీంలు పరిశీలించి సభలు, ప్రచారానికి వినియోగించిన ప్రతి వస్తువు లెక్కలోకి తీసుకుని ఖర్చుల లెక్క తయారుచేస్తారు. ఈ లెక్కను మళ్లీ అభ్యర్థికి ఇచ్చి ఏమైనా తేడాలు ఉంటే సరిచేసుకోవాలని సూచిస్తారు. తేడాలు ఉంటే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అబ్జర్వర్ అభ్యర్థికి నోటీసులు ప్రకారం సరిచేసుకోవాల్సి ఉంటుంది. చివరగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అబ్జర్వర్ మొత్తం ఖర్చుల లెక్కను ఆమోదించి సెగ్మెంట్ల వారీగా నమోదుకు అనుమతిస్తారు. అభ్యర్థుల వ్యయ పరిమితిపై నిఘా పక్కాగానే ఉన్నప్పటికీ, ఓటర్లను ప్రలోభపెట్టే క్రమంలో గుట్టుచప్పుడు కాకుండా చేసే అడ్డగోలు ఖర్చుల లెక్క ఏలా తెలుతుందన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది.

నిక్కచ్చిగా వ్యవహరిస్తాం



గెజిట్ నోటిఫికేషన్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అభ్యర్థి చేసే వ్యయంపై షాడో టీంలు పర్యవేక్షణ చేస్తాయి. ప్రచారంతోపాటు సభలు, సమావేశాల్లో ఎలాంటి ఖర్చు చేశారన్న విషయంలో షాడో టీంలు చేసిన వీడియో రికార్డులను ఆధారంగా ఖర్చులు లెక్క వేసి నమోదు చేస్తాం. ఎన్నికల సంఘం అనుమతించిన వ్యయ పరిమితికి మించి ఖర్చు చేయకూడదు.

– రాజేశ్వర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కోరుట్ల

బీఆర్ఎస్ ఇన్‌చార్జీల నియామకం

- ప్రచార జోరు పెంచిన కారు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ దూసుకుపోతోంది. గులాబీ బాస్ సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఎం కేసీఆర్ పాల్గొనే భారీ బహిరంగ సభల షెడ్యూల్ విడుదలైంది. తాజాగా నియోజకవర్గాల వారీగా పార్టీ తరఫున ఇన్‌చార్జిల నియమించారు. ఇతర పార్టీలు టిక్కెట్లు ఖరారు చేయడంలో తర్జనభర్జన పడుతుంటే.. గులాబీ పార్టీ ఈ నెల 15న అభ్యర్థులకు బీఫాంలను అందజేయనుంది. బీఆర్ఎస్ అధినేత రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఇలా అన్ని విషయాల్లో ప్రత్యర్థి పార్టీలకు అందుకోలేనంత స్పీడ్‌గా ప్రచారంలో కారు జోరు పెంచింది.



ఎల్.రమణ



రాజేశంగౌడ్

గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం..

అసెంబ్లీ ఎన్నికలకు నెలల సమయమున్నా సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించటంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారైన మరుసటి రోజు నుంచే వారు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గెలుపు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ తమను మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు మధ్య గ్యాప్ లేకుండా జిల్లాలోని 7 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు.

ఇన్‌చార్జీలు వీరే..

చొప్పదండి : గంగుల కమలాకర్
వేములవాడ : బి.వినోద్‌కుమార్
మానుకొండూర్ : జీవీ రామకృష్ణారావు
పెద్దపల్లి : రవీందర్‌సింగ్
మంథని: ఈద శంకర్‌రెడ్డి
రామగుండం: నారాదాసు లక్ష్మణరావు
జగిత్యాల: ఎల్.రమణ, రాజేశంగౌడ్

క్లుప్తంగా

దళితబంధు అర్హులకే అందించాలి


మాట్లాడుతున్న చంద్రశేఖర్

ధర్మపురి: దళితబంధును అర్హులైన నిరుపేదలకే అందించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ డిమాండు చేశారు. ధర్మపురిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దళితబంధును ఆర్థికంగా ఉన్నవారికి, ప్రజాప్రతినిధుల బంధువులకే అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో–కన్వీనర్ బందారు లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు గాజు భాస్కర్, దివిటి శ్రీధర్ తదితరులున్నారు.

ఒమన్‌లో పైడిమడుగు యువకుడి దుర్మరణం

- ఈనెల 2న రోడ్డు దాటుతుండగా ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు


మహేశ్ (ఫైల్)

కోరుట్ల రూరల్: గల్ఫ్ దేశమైన ఒమన్‌లో ఈనెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన కొంకర్ల మహేశ్ (23) మృతి చెందిన విషయం ఆలస్యంగా తెలిసింది. మహేశ్ ఉపాధి కోసం 14 నెలల క్రితం ఒమన్ వెళ్లాడు. అక్కడ ఓ కంపనీలో పని ముగించుకుని వస్తుండగా రోడ్డు దాటే క్రమంలో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఇక్కడి బంధువులకు సమాచారం అందింది. మహేశ్‌కు తల్లిదండ్రులు కొంకర్ల గంగవ్వ, సత్తయ్య, సోదరుడు ఉన్నారు. కుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందటంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. మహేశ్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని బంధువులు తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.1.50 లక్షలు స్వాధీనం


తనిఖీలో పట్టుబడిన నగదు

మల్యాల: మండలంలోని రాజారం శివారు చెక్ పోస్టు వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో అనుమతిపత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి నుంచి ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని జిల్లా అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తీగల అశోక్ తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా నర్సయ్య


పిసరి నర్సయ్య

కోరుట్ల: బీజేపీ జిల్లా కార్యదర్శిగా కోరుట్లకు చెందిన సీనియర్ నాయకుడు పిసరి నర్సయ్యను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు గురువారం నియామకపత్రం జారీ చేశారు. నర్సయ్య మాట్లాడుతూ.. తనకు సహకరించిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభకు ‘ఉపకారం’

- ‘ఎన్‌ఎంఎంఎస్’ తో భరోసా
- నేటితో ముగియనున్న గడువు
- డిసెంబర్ 10న రాతపరీక్ష
- ఎంపికైతే ఏటా రూ.12వేల స్కాలర్ షిప్

మల్లాపూర్: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఎనిమిదో తరగతి డ్రాపౌట్స్‌ను నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)తో ప్రోత్సహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తోంది. ఈ ›ఎన్ఎంఎంఎస్‹ దరఖాస్తుకు నేటితో గడువు ముగియనుంది.

అర్హతలు ఇవే..

2022–23 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్, మోడల్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు ఉండాలి. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతూ ఏడో తరగతిలో జనరల్, బీసీ కులానికి చెందిన వారు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి. ఆన్‌లైన్‌లో http//bre.telangana.gov.in ఎస్‌బీఐ కలెక్టర్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలి.

డిసెంబర్ 10న రాతపరీక్ష..

ఎన్ఎంఎంఎస్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో విద్యార్థులకు ఈ ఏడాది డిసెంబర్ 10న రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల్లో పరీక్ష ఉంటుంది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

పరీక్ష విధానం..

‘ఎన్ఎంఎంఎస్’ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటి (ఎంఏటి), రెండవది అప్టిట్యూట్ టెస్ట్ (ఎస్ఏటి) ఇందులో ఏడు, 8వ తరగతి పాఠ్యపుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాల విభాగాల్లో 90 మార్కులు చొప్పున మొత్తం 180 మార్కులు ఉంటాయి. ప్రతీ ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. కనీస అర్హత మార్కులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం కటాఫ్‌గా నిర్ణయించారు. ఎంపిక సమయంలో రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తారు.


వీవీరావుపేట పాఠశాల



ఎన్ఎంఎంఎస్ లోగో

ఆరేళ్లుగా స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు

ఏడాది	విద్యార్థులు
2017–18	71
2018–19	74
2019–20	69
2020–21	65
2021–22	67
2022–23	65

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పథకాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 13లోగ దరఖాస్తు చేసుకోవాలి. అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిస్తే నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున అందజేస్తారు.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు


బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

జగిత్యాలక్రైం: అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని పెగడపల్లి మండలం మద్దులపల్లిలో దాడి చేసి గుడుంబా తయారుచేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి 10 లీటర్ల గుడుంబా, 20 కిలోల బెల్లం పానకం సీజ్ చేశామని, 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో దాడులు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేశామని, అతని నుంచి 3.90 లీటర్ల బీర్లు, 1.88 లీటర్ల లిక్కర్ సీజ్ చేశామన్నారు. మద్యం విక్రయాలను నియంత్రించేందుకు జిల్లాలో 20 మందిని ఆయా తహసీల్దార్ల ముందు బైండోవర్‌కు అప్పగించామన్నారు. గురువారం ఎక్సైజ్ శాఖ జరిపిన దాడుల్లో 84,559 విలువ గల మద్యం, గుడుంబాను పట్టుబడిందన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్, పెగడపల్లి ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండలంలో నాటుసారా విక్రయిస్తున్న వారిని స్థానిక తహసీల్దార్ వీర్‌సింగ్ ఎదుట బైండోవర్ చేసినట్లు మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ ఎం.రాధ తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై సమాచారం ఉంటే 8712658826 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలన్నారు.

మంగేళలో..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళలో బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు. బెల్ట్‌షాపులో అక్రమంగా నిలువ ఉంచిన 10 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఎన్నారై పాలసీకి మద్దతిచ్చే పార్టీలకే ఓటు


జలేందర్

కోరుట్ల: రానున్న ఎన్నికల్లో ఎన్నారై పాలసీకి మద్దతిచ్చే పార్టీకే తమ కుటుంబసభ్యుల ఓట్లు వేయించి గెలిపిస్తామని గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు శ్రీరాముల జలేందర్ గురువారం సౌదీ అరేబియా నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకు గల్ఫ్‌లో 34 వేల మంది భారతీయులు మృతి చెందారని, 2023లో ఇప్పటివరకు 4,850 మంది కార్మికులు చనిపోయారని తెలిపారు. గల్ఫ్‌లో అత్యధిక మరణాలు నమోదవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, గల్ఫ్ కార్మికుల సమస్యలపై ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్నారై పాలసీకి మద్దతు తెలిపే పార్టీకే ఓట్లు వేయిస్తామని వివరించారు.

అంబులెన్స్ నిర్వాకం.. రోగికి శాపం


రోగిని ఓ ఆస్పత్రికి తీసుకువచ్చిన డ్రైవర్

జగిత్యాల: ఓ అంబులెన్స్ నిర్వాహకుడి తీరుతో రోగి తీవ్ర అవస్థకు గురయ్యాడు. ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే మరో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన ప్రభాకర్‌కు కిడ్నీ సంబంధిత నొప్పి రావడంతో బంధువులు అంబులెన్స్‌లో జగిత్యాలకు తీసుకొచ్చారు. బంధువులు చెప్పిన ఆసుపత్రికి కాకుండా అంబులెన్స్ డ్రైవర్ అతడికి తెలిసిన అశోక్‌నగర్ ప్రాంతంలోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. దీంతో రోగి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే ఇక్కడకు ఎందుకు తీసుకొచ్చావని ప్రశ్నించడంతో కొద్దిసేపు వివాదం తలెత్తింది. అంబులెన్స్ ఆస్పత్రిలోకి వెళ్లడం.. అక్కడ గల్లీ చిన్నగా ఉండటంతో అందులో ఇరుక్కుపోయింది. బయటకు రావడానికి సుమారు అరగంట పట్టింది. అప్పటివరకు ప్రభాకర్ నొప్పితోనే తీవ్ర ఇబ్బంది పడ్డాడు.

కమీషన్ల కోసమేనా..?

జిల్లాకేంద్రంలో ఇటీవల కొన్ని మల్టీస్పెషాలిటీ పేరిట ఆస్పత్రులు వెలిశాయి. వీరు అంబులెన్స్ డ్రైవర్లను మచ్చిక చేసుకుని రోగులను వారి ఆస్పత్రికే తీసుకొచ్చేలా మాట్లాడుకుంటున్నారు. ఇలా కమీషన్ కోసమే తాజాగా ఓ అంబులెన్స్ డ్రైవర్ ఆయనకు తెలిసిన ఆసుపత్రికి తీసుకెళ్లారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దుబాయ్‌లో గుండెపోటుతో వేంపేటవాసి మృతి


రాజగంగారాం (ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వేంపేటకు చెందిన దేశబోయిన రాజగంగారాం (49) దుబాయ్‌లో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉపాధి నిమిత్తం కొంతకాలం క్రితం రాజగంగారాం దుబాయ్‌కి వెళ్లి అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగించుకొని రూంకి వచ్చిన ఆయన నిద్రకు ఉపక్రమించే సమయంలో తీవ్రమైన గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గంజాయి పట్టివేత

మానకొండూర్:మండలంలోని సదాశివపల్లి స్టేజీ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కముటం భూమేశ్ సదాశివపల్లి స్టేజీ సమీపంలో కొందరికి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.25వేలు ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఒకరి ఆత్మహత్య

రామడుగు: మండలకేంద్రానికి చెందిన వానరాసి చంద్రయ్య (65) గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా గురువారం సాయంత్రం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు

- డీటీసీఎస్ వరప్రసాద్


రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: వినియోగదారులకు చేరాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని డీటీసీఎస్ వరప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తీన్‌ఖని చౌరస్తాలో సుంకె సుమలతకు చెందిన రేషన్ దుకాణంలో ఆకస్మికంగా తనిఖీ చేయగా.. 49.23 క్వింటాళ్ల రేషన్‌బియ్యం వ్యత్యాసం రావడంతో దుకాణాన్ని సీజ్ చేసి రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు అందించాల్సిన బియ్యం పక్కదారిపట్టిస్తే రేషన్ డీలర్లపై కఠిన చర్యలు చేపడతామన్నారు. రికార్డుల ప్రకారం దుకాణాల్లో బియ్యం నిలువలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఐలు మహేశ్వర్ రావు, స్వామి పాల్గొన్నారు.

ముగ్గురు బాలికలపై వృద్ధుడి లైంగికదాడి

- మూడు నెలలుగా అకృత్యం
- జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితుడు..?

గొల్లపల్లి: ముగ్గురు బాలికలపై ఓ వృద్ధుడు మూడు నెలలుగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన మండలంలోని తిర్మాలాపూర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. తాత అని పిలిచిన వారికి డబ్బు ఆశ చూపి.. మాయమాటలు చెప్పి ఈ అకృత్యానికి ఒడిగడుతున్నాడు. పిల్లల ఆరోగ్యం బాగలేకపోవడంతో వారి తల్లులు మందలించగా.. అసలు విషయం బయటపడింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు రంగధాముని పల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకరు ఐదు, మరొకరు నాలుగు, ఇంకొకరు మూడో తరగతి చదువుతున్నారు. ముగ్గురి తండ్రులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. తల్లులు కూలి పనిచేస్తూ వీరిని పోషించుకుంటున్నారు. వీరి సామాజికవర్గానికే చెందిన శివరాత్రి ముత్తయ్య (65) వీరి ఇంటి సమీపంలో ఉంటాడు. పిల్లలకు సెలవు రోజు ఇంటికి పిలిచి డబ్బులు ఇవ్వడంతోపాటు పొలం వద్దకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడుతున్నాడు. ఇలా మూడు నెలలుగా తన కామవాంఛ తీర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో చిన్నారులు నాలుగురోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. తల్లులు ఆరా తీయగా జరిగిన విషయాన్ని వారితో చెప్పారు. సదరు కామాంధుడిని కుల సంఘంలోకి పిలిస్తే రాకపోగా.. బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుల తల్లులు అంటున్నారు. దీంతో చేసేది లేక వారు గొల్లపల్లి పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.

అడిగితే బెదిరింపులు

తమ పిల్లలకు జరిగిన అన్యాయంపై సంఘం దృష్టికి తీసుకెళ్లగా.. కుల పెద్దలు పిలిచినా ముత్తయ్య రాలేదని, పైగా ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్ తమనే బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపించారు.

ఉరి తీయాలి

తమ పిల్లల జీవితాలను నాశనం చేసిన ముత్తయ్యను ఉరితీయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి నిందితుడితోపాటు ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సదరు నిందితుడిని ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

అభివృద్ధి కోసం సంజయ్‌ను ఆశీర్వదించండి


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే

మెట్‌పల్లిరూరల్: అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం తన కుమారుడు సంజయ్‌ను ఆశీర్వదించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. జగ్గాసాగర్, ఆత్మకూర్, ఏడీబీతండాకు చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్ లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మరోమారు అధికారంలోకి రావడం ఖాయమని, అందుకు ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఆత్మకూర్ యాదవ చిన్న సంఘం సభ్యులు బీఆర్ఎస్‌కే ఓటేస్తామని తీర్మానం చేశారు. అంతకుముందు వెల్లులలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


రామకిష్టపూర్‌లో మాట్లాడుతున్న రవిశంకర్

కొండగట్టు(చొప్పదండి): బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కొడిమ్యాల మండలంలో ఇంటింటికీ ప్రచారం చేశారు. తుర్కకాశీనగర్, చెప్యాల, రామకిష్టపూర్, కొండపూర్, నాచుపెల్లి గ్రామాల్లో పర్యటించారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయికల్‌కు సంజయ్ ఏం చేశారు..?


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: రాయికల్‌కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. సీఎం కేసీఆర్ పథకాలేవీ పేదలకు అందలేదన్నారు. నిరుద్యోగ భృతి అందించలేదని, గృహలక్ష్మీ పథకంతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి కబ్జాకు గురైతే ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు ఏం చేశారని ప్రశ్నించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి


ముత్యంపేటలో ప్రచారం చేస్తున్న నవీన్‌కుమార్

మల్లాపూర్ : ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిఇంటికి వెళ్లి వివరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపేటలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో మాట్లాడారు. తొమిదేళ్లుగా దేశం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందన్నారు. పసుపుబోర్డు తెచ్చిన ఘనత ఎంపీ అర్వింద్‌కు దక్కుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే సతీమణి రాధిక


రాధికకు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న ప్రజలు

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మరోసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక అన్నారు. గురువారం పట్టణంలోని 17, 18 వార్డుల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. కౌన్సిలర్లు నవీన్, సింగారావు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడండి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న అడ్లూరి

గొల్లపల్లి: ‘నాలుగు సార్లు ఓడిపోయిన. అయినా మిమ్మల్నే నమ్ముకున్న. ఎన్ని ఇబ్బందులు వచ్చినా మీ మధ్యనే ఉన్న. మీ కోసం అనుక్షణం పోరాడుతున్న. ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడండి. మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటా.. అభివృద్ధి చేసి చూపిస్తా..’ అని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉద్వేగానికి లోనయ్యారు. మండలంలోని చిల్వాకోడూర్, దట్నూర్ గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ధర్మపురి నృసింహ స్వామి ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయిస్తానన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇప్పటివరకు ఎన్ని నిధులు ఖర్చు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. చిల్వాకోడూర్, దట్నూర్ గ్రామాల్లో ఎంతమందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టించారో.. ఎంతమందికి దళితబంధు ఇచ్చారో ప్రజలు గ్రహించాలన్నారు. కాళేశ్వరం లింక్–2 కింద వందలాది ఎకరాల సాగు భూమిని అధికారులు, పోలీసులను అడ్డుపెట్టి.. రైతులను భయభ్రాంతులకు గురిచేసి లాక్కుంటే మంత్రి ఈశ్వర్ కనీసం నోరు మెదపలేదన్నారు. అందులో మంత్రికి వాటా ఉండడంతోనే మౌనం దాల్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, పంటలకు రూ.500 బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ నిధి పెంపు, మహిళలకు చేయూత కింద రూ.4 వేల ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి, సర్పంచ్ చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, రాజ్యలక్ష్మీ, ఉపసర్పంచ్ వెంకటేశ్, శ్రీధర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి, టౌన్ అధ్యక్షుడు మహేశ్, మాజీ సర్పంచ్ నారాయణ, రాజేశ్వర్, గ్రామ అధ్యక్షుడు కొమురయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రాజేశ్, లక్ష్మీపూర్ గ్రామ అధ్యక్షుడు తిరుపతి, ముజ్జు, అశోక్, ముల్కల శ్రీనివాస్, తడగొండ విజయ్, గంగాధర్, స్వామి, శేఖర్, రమేశ్, జాన్, గంగారాం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం


డివైడర్‌ను ఢీకొట్టిన అడిషనల్ కలెక్టర్ వాహనం

కొండపాక(గజ్వేల్): పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్‌లాల్‌కు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం.. అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్ హైదరాబాద్ నుంచి రామగుండం వైపునకు ప్రభుత్వ వాహనంలో బయలుదేరారు. వారి వాహనానికి ముందు వెళ్తున్న ఒక కారు రాజీవ్ రహదారిపై ఉన్న చిన్నకిష్టాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా తిరిగింది. దీంతో అడిషనల్ కలెక్టర్ వాహన డ్రైవర్ దానిని తప్పించబోయి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.